



# బామ్మ బర్త్‌డే

డా.కొఠారి వాణీ చలపతిరావు

స్కూలు యూనిఫాంలో వచ్చి చేతిలో చాక్లెట్ డబ్బా ఓపెన్ చేస్తున్న సుమంత్‌ని చూసి...చుట్టూ మూగిన పిల్లలు ఆశ్చర్యపోయారు.

"ఏంటిరా...ఇవ్వాళ నీ హ్యాపీ బర్త్‌డేనా? మరి యూనిఫాం వేసుకున్నావేంటి? కొత్త బట్టలు వేసుకోకుండా?" అన్నాడు ప్రవీణ్.

సుమంత్,ప్రవీణ్ ఐదవ తరగతిలో బెంచ్‌మేట్సే కాదు, మంచి క్లోజ్ ఫ్రెండ్స్ కూడా.

"ఏయ్ పిచ్చా నీకు? ఇవ్వాళ నా బర్త్ డే కాదురా మా బామ్మ బర్త్ డే!" అన్నాడు సుమంత్ చాక్లెట్ ఒకటి చేతిలో పెడుతూ.

"మీ బామ్మ కూడా బర్త్ డే చేసుకుంటుందా?" అని అడిగాడు గుంపులో ముందు వరసలో ఉన్న ప్రశాంత్.

"ఎప్పుడూ చేసుకోదు పాపం. నేను, మా తమ్ముడు, మా చెల్లి తలంటుపోసుకుని, కొత్తబట్టలేసుకుని, కేక్ కట్ చేసి ఎవ్విరి ఇయర్ బర్త్‌డే చేసుకుంటాం కదా! మొన్న మా తమ్ముడి బర్త్ డే రోజు నాకే ఒక ఐడియా వచ్చింది. బామ్మ బర్త్ డే ఒక్కసారయినా గ్రాండ్‌గా చెయ్యాలని. తమ్ముడికీ, చెల్లికీ చెబితే 'ఓ.కే.చేద్దాం!' అన్నారు. ముగ్గురం కలిసి బామ్మ దగ్గరికి వెళ్లి 'బామ్మ, బామ్మా నువ్వెప్పుడు పుట్టావు?' అని అడిగాం. 'ఏమోరా ఎప్పుడు పుట్టానో నాకో తెలియదు. మా అమ్మా, నాన్నా నాకెప్పుడూ ఈ విషయం చెప్పలేదు. ఇప్పుడు మీరు చేసుకుంటున్నట్టుగా మేము చిన్నప్పుడు ఎప్పుడైనా పుట్టిన రోజులు చేసుకున్నామా ఏమన్నానా?' అంది. 'అలాకాదు ఏదో ఒక రోజు గుర్తుచేసుకుని చెప్పు' అంటే 'శ్రావణమాసంలో పుట్టినట్టున్నాను. అందుకే వరలక్ష్మి అని పేరు పెట్టారు' అంది. ఈరోజు శ్రావణ శుక్రవారం కదా అందుకని ఈరోజు బామ్మ బర్త్‌డే చేద్దామని అనుకున్నాం. త్రీ మంత్స్ నుంచీ మమ్మీ డాడీ ఇచ్చిన డబ్బులూ, ఇంటికెవరయినా చుట్టాలు వచ్చినప్పుడు 'ఏమన్నా కొనుక్కోండి పిల్లలూ!' అని మా చేతుల్లో పెట్టి వెళ్లిన డబ్బులూ కలక్ట్ చేస్తే ఫోర్ హండ్రెడ్ థర్టీ టూ రూపీస్ అయ్యాయి తెల్సా! వాటితో ఈరోజు మేము మా బామ్మ బర్త్‌డే చేస్తున్నాం. ఈ చాక్లెట్లు ఆ డబ్బుల్లో నుంచి తెచ్చినవే!" మెరిసే కళ్లతో గర్వంగా చెప్పాడు సుమంత్.

ఆ క్షణంలో అక్కడున్న పిల్లలందరికీ వాళ్ల వాళ్ళ బామ్మలు గుర్తుకొచ్చారు.

'నాకు బామ్మలేదుగా, నేను బర్త్‌డే ఎలా చెయ్యను?' అని దిగులుగా ముఖం పెట్టి ఒక్కక్షణం ఏదో ఆలోచించి 'ఐడియా..అమ్మమ్మ ఉందిగా. నేను తన బర్త్‌డే చేస్తాను' అనుకున్నాడు ప్రశాంత్.

"నేనూ మా బామ్మ బర్త్ డే చేస్తాను" అన్నాడు ప్రవీణ్ బిగ్గరగా.

"అరేయ్. నాకు బామ్మ, అమ్మమ్మ ఇద్దరూ లేరు. తాతయ్య ఒక్కడే ఉన్నాడు ఎలారా?" అన్నాడు సమీర్ దిగులుగా.

"అయితే ఇంకేం తాతయ్య బర్త్ డేనే చెయ్యి. బామ్మ గ్రాండ్ మదర్ అయితే తాతయ్య గ్రాండ్ ఫాదర్. అంతేగా..ఏం తేడా వుంటుంది?" అన్నాడు సుమంత్...అందరికీ ఐడియాలు ఇవ్వటంలో తను లీడర్ అన్న ఫోజు పెట్టి.

ఇంతలో క్లాస్ స్టార్ట్ అయింది. సుమంత్ పక్కన కూర్చుని పాఠం వింటున్నాడనే గానీ ప్రవీణ్ ఆలోచనలన్నీ బామ్మ బర్త్‌డే మీదనే ఉన్నాయి.

సుమంత్ టీచర్లందరికీ 'మా బామ్మ బర్త్ డే టీచర్!' అంటూ చాక్లెట్ ఇవ్వటం...అందరూ 'వెరీగుడ్' అని మెచ్చుకుంటూ, చాక్లెట్ తీసుకోవటం, తెలుగు టీచర్ 'మీ బామ్మకు పుట్టినరోజు చేస్తూ చాక్లెట్స్ పంచుతున్నావా, చాలా సంతోషం. ఇప్పటి ఈ సమాజానికి నీలాంటి వాళ్లే కావాలయ్యా' అంటూ మరీ మరీ మెచ్చుకోవటం చూసినప్పటి నుంచీ తనకూ తన బామ్మ బర్త్ డే చేయాలన్న కోర్కె బలంగా మనసులో నాటుకునిపోయింది.

టీచర్ బోర్డు మీద రాసింది నోట్ బుక్కు మీద ఎక్కించుకుంటూ తలవంచుకునే "మీ బామ్మకు ఇప్పుడు ఏ ఇయర్ వస్తుందిరా?" అని అడిగాడు ప్రవీణ్.

"సెవంటీ టూ"

"అబ్బో! అన్ని ఇయర్సా?"

"బామ్మలంటే మరి అన్ని ఇయర్సే ఉంటాయి. నీలా నాలా టెన్ ఇయర్స్, లెవన్ ఇయర్స్ ఉంటాయా?"

"మా బామ్మకు ఎన్ని ఇయర్సో ఇంటికెళ్లాక అడగాలి?"

"సాయంత్రం మా ఇంట్లో మా బామ్మతో కేక్ కట్ చేయిస్తున్నాం. క్లోజ్‌ఫ్రెండ్స్‌ని పిలవమని చెప్పింది మా మమ్మీ. నువ్వు రావాలిరా..ష్యూర్‌గా వస్తావు కదా ప్రశాంత్, సమీర్, భార్గవిలను కూడా పిలుస్తాను. నీకో విషయం తెల్సా... ఈవినింగ్ మేము బామ్మ బర్త్‌డే పార్టీ అరేంజ్ చేస్తున్నట్టు మా బామ్మకు చెప్పలేదు. సర్‌ప్రయిజ్ ఇద్దామనుకున్నాం"

"అసలు నీకు ఈ ఐడియా ఎలా వచ్చింది రా?"

"మా బర్త్‌డేలని బామ్మ ఎంత మురిసిపోతూ చేస్తుందో తెల్సా..పొద్దున్నే తలంటి స్నానాలు చేయిస్తుంది. మంగళహారతి పడుతుంది. మా బుగ్గలు పట్టుకుని ముద్దు చేస్తూ మెటికలు విరిచి దిష్టి తీస్తుంది. అక్షింతలు మా తలమీద వేసి 'దీర్ఘాయుష్మాన్ భవ' అని దీవిస్తుంది. మేము ప్రక్క మీద నుంచి లేవక ముందే స్వీటు, హాటు తయారు చేసి ఈరోజు మా మనవడి పుట్టిన రోజండీ! అంటూ పక్కింటి ఆంటీ వాళ్లకు, ఎదురింటి అక్కావాళ్లింటికీ పంపిస్తుంది. సాయంత్రం పార్టీ టైమ్‌లో హారతి పట్టేటప్పుడు 'దేవుళ్లందరినీ వచ్చి దీవించమని' మంగళహారతి పాడుతుంది. మా బామ్మకు మేమంటే ఎంతో ప్రేమ. అలాంటి బామ్మకు మనమూ ఏదయినా చేసి మనమూ ఆమెను ప్రేమించాలి కదా" అని ఆలోచించాను..అని సుమంత్ అంటూ ఉంటే టీచర్ 'సైలెన్స్' అని పెద్దగా అరిచింది.

దాంతో "తర్వాత మాట్లాడదాంలే!" అన్నాడు సుమంత్ గుసగుసగా.

పుస్తకాల సంచీలు భుజాన వేసుకుని బయటకు వస్తుంటే..అదే ధ్యాసలో ఉన్న సుమంత్ మళ్లీ మొదలుపెట్టాడు.

"మా మమ్మీ, డాడీ మాలాగ కాకపోయినా వాళ్లూ బర్త్‌డేలు చేసుకుంటారు. మమ్మీ బర్త్‌డే రోజు డాడీ కొత్త చీర తెస్తారు. మమ్మీని విష్ చేస్తారు. మేమూ విష్ చేస్తాం. బామ్మ స్వీట్ చేస్తుంది. డాడీ బర్త్‌డే రోజు మమ్మీ డాడీకి గిఫ్ట్ ఇస్తుంది. అందరం కలిసి ఆ సాయంత్రం హోటల్‌కి వెళ్తాం. కానీ పాపం ఒక్క బామ్మకే బర్త్‌డే జరగదు ఎప్పుడూ. బామ్మ కూడా బర్త్‌డే చేసుకుంటుంటే నాకు చూడాలని అనిపించింది. చప్పట్లు కొడుతూ 'హ్యాపీ బర్త్‌డే టూ యూ బామ్మా' అని పాట పాడాలని అనిపించింది. మా బామ్మ బర్త్‌డే చేస్తే మా తాతయ్య తన బర్త్‌డే చేసినంత హ్యాపీ! ఆయనకు ఆమె అంటే అంత ఇష్టం మరి!" అన్నాడు సుమంత్ సంతోషంగా.

"నీ మాటలు వింటుంటే నాకూ మా బామ్మ బర్త్‌డే



చేయాలని అనిపిస్తుందిరా..కానీ ప్రోబ్లమే!" అన్నాడు ప్రవీణ్ నిరాశగా.


"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు సుమంత్.

"మా మమ్మీకి మా బామ్మ అంటే ఇష్టం ఉండదురా! ఎప్పుడూ తనతో పోట్లాడుతూ వుంటుంది. ఇంక బర్త్‌డే చేస్తానంటే ఒప్పుకుంటుందా? ప్రశాంత్‌కు ఉంది అమ్మమ్మ గనుక వాడికి ఆ ప్రోబ్లమ్ ఉండదు" అన్నాడు ప్రవీణ్.

"ఎందుకురా మీ మమ్మీకి మీ బామ్మంటే కోపం?"

"మా బామ్మ మా డాడీ మమ్మీగదా..మా మమ్మీకి మమ్మీ కాదు గదా?"

"అయితే ఏంటి..మా బామ్మా అంతే కదా? మా మమ్మీ ఎప్పుడూ మా బామ్మతో పోట్లాడదు. ఇద్దరూ ఫ్రెండ్స్‌లా ఉంటారు. కలిసి పనిచేసుకుంటారు. కబుర్లు చెప్పుకుంటారు. కలిసి గుడికి వెళతారు. ఇలా అన్న మాట!" అంటూండగానే ఆటో దగ్గరికి వచ్చేసారు ఇద్దరూ.



"ఈవినింగ్ ష్యూర్‌గా రావాలిరా!" అంటూ తన ఆటో ఎక్కాడు సుమంత్!

"ఓ! తప్పకుండా వస్తాను" అంటూ తన ఆటో వైపు నడిచాడు ప్రవీణ్.

* * *

ముందు ఏ మాత్రం చెప్పకుండా తనకు పుట్టిన రోజు అంటూ హడావుడీ చేసి "రా..బామ్మా" అంటూ ప్రత్యేకంగా సిద్ధం చేసిన పెద్ద కుర్చీ దగ్గరకు తీసుకెళ్తున్న మనవళ్లను, మనవరాలిని చూసి బామ్మ వరలక్ష్మి ముందు ఆశ్చర్యంతో నోరెళ్లబెట్టింది. ముక్కున వేలేసుకుంది. "నాకు ఈ వయసులో పుట్టినరోజు పండగ ఏంట్రా..మీకేమన్నా పిచ్చా..చాదస్తమా?హవ్వ..ఎవరన్నా వింటే నవ్విపోతారు" అని మందలించింది.

"వెళ్లండి అత్తయ్యగారూ..పిల్లలేదో సరదా పడుతున్నారు" అని కోడలూ..."వెళ్లమ్మా!" అని కొడుకూ "వెళ్లవే..బెట్టు చేస్తావేంటి" అని మొగుడుగారూ అనటంతో, పిల్లలు తన రెండు చేతులూ పట్టుకుని లాగుతుండటంతో వెళ్లి కుర్చీలో కూర్చుంది.

ఆ తరువాత పల్లకీలో పెళ్లి కూతురిలా తెగ సిగ్గుపడిపోయింది.

కోడలు నీరజ అత్తగారికి పసుపు కుంకుమలిచ్చి గుంటూరు జరీ చీర పెట్టింది.

పిల్లలు సర్ర్పయిజింగ్‌గా పెద్ద కేకు తెచ్చి ఆమె ముందు టీపాయి మీద పెట్టారు. రాణీపింక్ కలర్‌లో దాని మీద 'బామ్మకు పుట్టినరోజు శుభాకాంక్షలు' అన్న అక్షరాలు అందంగా కనిపించటంతో "ఇది కూడానా..నేనేమయినా చిన్నపిల్లనా?' అంది బామ్మ ఈసారి మరింత సిగ్గుపడిపోతూ.

మధ్యాహ్నం నుంచీ పిల్లలు హాల్‌లో రంగు రంగుల బెలూన్‌లు కట్టి, పూలతో గోడలను అలంకరిస్తుంటే ఎందుకో అనుకుంది వరలక్ష్మి. "ఏంటర్రా..ఈరోజు విశేషం?" అని అడిగినా ఎవ్వరూ చెప్పలేదు. "ఇదన్న మాట?" అనుకుంది ఆమె.

పిల్లలందరూ బామ్మ చుట్టూ చేరారు. పదేళ్లకు ఒకటిగా ఏడు క్యాండిల్స్ వెలిగించారు. విప్పారిన కళ్లతో పిల్లలంతా ఆ కేక్ వంకే చూస్తున్నారు.

"హ్యాపీ బర్త్‌డే అని రాయించకుండా తెలుగులో రాయించావేంటిరా?" అని అడిగాడు ప్రవీణ్ సుమంత్‌ని!

"మా బామ్మకు ఇంగ్లీషు రాదు కదురా..ఎలా చదువుకుంటుంది?" అని ప్రశ్నకు ప్రశ్నతోనే సమాధానం చెప్పాడు సుమంత్.

"ఓహో అలాగా!" అన్నాడు ప్రవీణ్.

"బామ్మా కేక్ కట్ చెయ్యి" అన్నారు సుమంత్, రేవంత్, దీప్తి ఒకేసారి.

చాకు చేతిలో పట్టుకుని చిరునవ్వుతో, చిరుసిగ్గుతో బామ్మ కేక్ కట్ చేస్తుంటే..ఎన్నో ఏళ్లుగా అంతర్గతంగా ఆమె మనసులో ఉండిపోయిన ఓ చిన్నకోరిక ఆ రోజు నెరవేరుతున్నట్లు అనిపించి మనసు ఆనందంతో చిన్న పిల్లలా గంతులేసింది. మనవళ్లు, మనవరాలు ప్రతి పుట్టిన రోజుకూ కేక్ కట్ చేస్తుంటే తనకూ ఒక్కసారి అలా కేక్ కట్ చేయాలన్న కోరిక కలిగేది గుప్తంగా బామ్మ మనసులో.

ఆ కాలంలో పుట్టబట్టి ఇలాంటి సరదాలేవీ మేము ఎరగం! ఎంతయినా ఈ కాలం పిల్లలు అదృష్టవంతులు! అనుకునేది. ఆ కోరిక అనుకోకుండా పిల్లల మూలంగా ఆరోజు అలా తీరుతుండడంతో సంభ్రమాశ్చర్యాలకు లోనయింది బామ్మ.

"హ్యాపీ బర్త్‌డే టూ యూ బామ్మా!" అన్నారు సుమంత్, రేవంత్, దీప్తి.

"హ్యాపీ బర్త్‌డే టూ యూ బామ్మా డియర్" అని పిల్లలందరూ చప్పట్లు కొడుతూ రాగయుక్తంగా పాడుతుండడంతో బామ్మకే కాదు, అక్కడ చుట్టూ వున్న వాళ్లందరూ చాలా థ్రిల్ ఫీలయ్యారు.

ఎప్పుడూ పిల్లల బర్త్‌డేలకు మాత్రమే వెళ్లటం అలవాటయిన ఆ పిల్లలందరికీ 'బామ్మ బర్త్‌డే' వెరైటీగా, ఉత్సాహంగా అనిపించి ఒక కొత్త ఫీలింగ్‌ని కలిగించింది.

బామ్మ కేక్ కట్ చేసి ముందు తన మనవలకు, మనవరాలి, ఆ తర్వాత పిల్లలందరికీ తినిపించింది.

వాళ్లు బామ్మ నోట్లో కేక్ పెట్టారు.

కొడుకూ, కోడలికి కూడా పెట్టింది.

"మరి తాతయ్యకు?" అన్నారు పిల్లలు.

భర్తకు కేక్‌ను మునివేళ్లతో అందించింది. ఆయన దాన్ని నోటితో అందుకుంటూ వుంటే పెళ్లినాటి బూజంబంతిలో ఒకరికొకరు మైసూర్‌పాక్ నోటికందించుకున్న దృశ్యం కళ్లముందు మెదిలి సిగ్గులమొగ్గయింది బామ్మ.

తాతయ్య చిరునవ్వులోనూ కనిపించీ కనపించకుండా సిగ్గు లాస్యం చేసింది. ఆ దృశ్యాన్ని వాళ్ల కొడుకూ, కోడలూ మాత్రమే కనిపెట్టి ముఖాముఖాలు చూసుకుని నవ్వుకున్నారు.

అది ఓ అద్భుత సంఘటనగా, అరుదైన భావనగా వాళ్లకు అనిపించింది. పిల్లలందరూ బామ్మకు పాదాభివందనం చేశారు. ప్రశాంత్ రెండు గులాబీ పూలు ఆకులతో అందంగా కలిపి చేసిన బొకేను బామ్మకు బహుమతిగా అందించాడు.

భార్గవి అనే అమ్మాయి బామ్మకు 'లలితా సహస్ర నామాల' పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చింది. దాన్ని బామ్మ భక్తిగా అందుకుని కళ్లకద్దుకుని పక్కన పెట్టింది.

పక్కింటి పావని అనే అమ్మాయి స్టీలు కుంకుమ భరిణను గిఫ్ట్‌గా ఇచ్చింది. ఇంట్లో తల్లులు సెలక్ట్ చేసి, పిల్లలకు ఇచ్చి పంపిన బహుమతులు అవి!' అన్న ఆలోచన రాగానే బామ్మ కళ్లు భావోద్వేగంతో చెమర్చాయి.



ప్రవీణ్ మాత్రం జేబులో నుంచి ఏదో బహుమతి తియ్యబోయి సందేహిస్తూ ఆగిపోవటం చూసి "ఏం తెచ్చావురా? తియ్యవేం?" అన్నాడు చనువుగా సుమంత్.

"మా మమ్మీకి మా ఫ్రెండ్ బర్త్‌డే అని చెప్పానురా! బిస్కట్ పాకెట్ ఇచ్చి పంపింది. బామ్మకు అది ఎలా ఇవ్వను?" అన్నాడు బేలగా ప్రవీణ్.

"ఏం పర్వాలేదురా! మా బామ్మ బిస్కట్‌లు తింటుంది. రోజూ ఈవెనింగ్ టైములో మమ్మీ బామ్మకు స్టీలు గ్లాసుడు పాలిచ్చి, రెండు బిస్కట్లు ఇస్తుందిగా" అనగానే బిస్కట్ పొట్లాన్ని బామ్మ చేతిలో బెరుకుగా పెట్టాడు ప్రవీణ్.

బామ్మ ఆ ప్యాకెట్‌ను మురిపెంగా అటూ ఇటూ తిప్పి చూసి చిన్నపిల్లలా మురిసిపోయింది. ప్రవీణ్‌కు బామ్మ ఆ చర్య ఎంతో నచ్చి తృప్తిగా అనిపించింది.

పిల్లలందరికీ సుమంత్ వాళ్ల మమ్మీ పేపర్ ప్లేట్‌లో కేకు, స్వీటు, చిప్స్ పెట్టి సర్వ్ చేస్తుంటే, వాళ్ల డాడీ అందరికీ కోక్ గ్లాసులను ఆప్యాయంగా అందించాడు.

అదంతా చూస్తున్న తాతయ్యకు కన్నులపండుగలా వుంది. పిల్లలందరి మనసుల్లోనూ 'మేమూ ఇలాగే మా బామ్మ బర్త్‌డే చేయాలి' అన్న ఆలోచనకు బీజం పడిపోయింది.

'మా అమ్మమ్మ బర్త్‌డే చేస్తాను నేను' అని ఒకరనుకుంటే 'మా తాతయ్య బర్త్ డే అచ్చం ఇలాగే చేస్తాను నేను' అని మరొకరు అనుకున్నారు.

ఒక మంచి సంస్కృతికి పిల్లలు నాటిన బీజం అది! మరెందరి మనసుల్లోనో పుష్పించి, ఫలించి, రాబోయే కాలాన్ని నందనవనంలా మార్చేయబోతున్నది త్వరలోనే!

ఒక ఐడియా జీవితాల్నే కాదు, అమాంతం కాలాన్నే మార్చేయగలిగినంత శక్తిగలది మరి!

## ఇదో పిచ్చి!

సెలీనా జైట్లీకి ఓ వింత అలవాటుంది. అది షూస్ కలెక్షన్. ఇప్పటి వరకూ ఆమె దగ్గర రకరకాల డిజైన్‌లున్న 1500 జతల షూస్ భద్రంగా వున్నాయిట. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి తన పేరు నమోదయ్యేలా ప్రయత్నిస్తున్నట్టు చెబుతున్న సెలీనా ఎక్కడైనా కాస్త వెరయిటీగా అందంగా షూస్ కనిపిస్తే చాలు వెంటనే వాటిని కొనేసి తన కలెక్షన్‌లో భద్రపరుస్తుందిట. షూస్‌ని కలెక్ట్ చేయడంలో ఇంత శ్రద్ధ కనబరుస్తున్న సెలీనా త్వరలో ఏదైనా షూస్ షోరూం తెరిచినా ఆశ్చర్యం లేదంటున్నారు ఆమె సన్నిహితులు.